క్లుప్తంగా

ఘనంగా సేవా దినోత్సవం



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయిబాబా 98వ జయంతిని పురస్కరించుకొని శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీపీ కాలనీలోని లెబన్‌హిల్స్ మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు. పెద వాల్తేర్‌లోని రాణి చంద్రమదేవి ఆస్పత్రిలో మెడికల్ కిట్లు, పండ్లు పంపిణీ చేశారు.

ఫార్మసీ బీవోఎస్‌గా ఈశ్వర్‌కుమార్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఈశ్వర్‌కుమార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్ నియమితులయ్యారు. సోమవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి ఆయన ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్‌ని కళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఆర్టీసీ గ్యారేజీ ఉద్యోగుల సమస్యలపై చర్చ

ఎంవీపీ కాలనీ: ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం సోమవారం వాల్తేర్ డిపో ప్రాంగణంలో జరిగింది. విజయనగరం జోన్‌లో ఉన్న ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ గ్యారేజీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపకార్యదర్శి పి.భానుమూర్తి మాట్లాడుతూ గ్యారేజ్ ఉద్యోగులకు అవసరానికి అనుగుణంగా టూల్స్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల మరమ్మతుల కోసం మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ విజయనగరం జోన్ కార్యదర్శి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత విశాఖకు సహకరించండి



ఆటోలో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కోరారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ తన క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

నేత్ర విద్యాలయానికి సాయం

ఎంవీపీ కాలనీ: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భీమిలి బీచ్ రోడ్డులోని నేత్ర విద్యాలయానికి నిత్యావసర సరకులు అందజేశారు. చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ నేత్ర విద్యాలయానికి ఈ ఆలయ కమిటీ తరచూ నిత్యావసర సరకులు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భక్తుల ద్వారా సేకరించిన నిధులతో సుమారు రూ.23 వేలు విలువ చేసే ఆహార పదార్థాలు, సరకులు విద్యాలయం ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు, సభ్యులు గౌరీశంకర్, అర్చకులు లక్ష్మణస్వామి, శ్రీనివాస్, జగన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ పాలక మండలి అభినందనలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ప్రసాదరెడ్డిని వర్సిటీ పాలక మండలి సభ్యులు సోమవారం అభినందించారు. నాక్ గ్రేడింగ్‌లో ఏయూ అత్యున్నత స్థానాన్ని సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, పాలక మండలి సభ్యులు ఆచార్య పి.సునీత, ఆచార్య జి.శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రాప్తిరస్తు



• ఈయన పేరు వై.త్రినాథరావు, జైభీం నగర్, ఆరిలోవ కాలనీ. ఈయనకు మధుమేహం ఉంది. దీనికి తోడు ఇటీవల చేతి వేళ్లకు గాయమైంది. మధుమేహం కారణంగా గాయం తగ్గడంలేదు. దీంతో సమీపంలో ఉన్న ఆరిలోవ యూపీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారు. ఇప్పుడు తరచూ షుగర్ పరీక్షలు కూడా చేయించుకోవడానికి వెళ్తున్నారు. ఇంటికి దగ్గరలోనే ఆస్పత్రి ఉండడం.. ఎలాంటి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందుతున్నాయి. దీంతో ఆయన ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



• ఈమె పేరు పావని, బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల తన బాబుకు జ్వరం, జలుబు చేసింది. ఆ సమయంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో డాక్టర్‌కు చూపించారు. మందులు ఇచ్చారు. అనంతరం దగ్గరలోని బాలాజీనగర్ యూపీహెచ్‌సీకి వెళ్లి చూపించమని చెప్పారు. అక్కడికి వెళ్లి చూపించగా అన్ని పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. గతంలో అయితే దూరంగా ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సి రావడంతో వ్యయ, ప్రయాసలు పడేవారు. ఇప్పుడు ఆ సమస్య తీరడంతో పాటు మెరుగైన వైద్యం అందడంతో ఆ కుటుంబం హర్షం వ్యక్తం చేస్తోంది.

ఇలా మేలు పొందుతున్నదీ ఒక్క త్రినాథరావు, పావని కుటుంబ సభ్యుల మాత్రమే కాదు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో వేలాది కుటుంబాలు తమ నివాసానికి సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం ఏర్పాటు చేసిన వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు(యూపీహెచ్‌సీ) సత్ఫలితాలు ఇస్తున్నాయి.

- పేదల వైద్యానికి ప్రభుత్వ భరోసా
- పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో ప్రజలకు మేలు
- అందుబాటులో అన్ని రకాల వైద్య సేవలు
- చెంతకే వైద్యంపై లబ్ధిదారుల హర్షం



ఆరిలోవ: పేద ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం నగరంలో వార్డుల వారీగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా విశాఖ తూర్పు నియోజకవర్గంలో యూపీహెచ్‌సీలను గతేడాది అక్టోబరు నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. నియోజకవర్గం జీవీఎంసీ జోన్–2, 3 పరిధిలో ఉంది. జోన్–2 పరిధిలో 4 యూపీహెచ్‌సీలు ఉండగా.. జోన్–3 పరిధిలో 4 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. జోన్–2 పరిధి 10వ వార్డు ఆదర్శనగర్ ప్రాంతం వివేకానందనగర్, 11వ వార్డు బాలాజీనగర్, 13వ వార్డు ఆరిలోవ కాలనీ, శ్రీకృష్ణాపురంలో అందుబాటులో ఉన్నాయి.

రోజువారీ స్పెషలిస్ట్ వైద్య సేవల వివరాలు

వారం	ఓపీ
సోమవారం	ఈఎన్‌టీ
మంగళవారం	పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్
బుధవారం	జనరల్ ఫిజీషియన్
గురువారం	ఆర్థోపెడిక్
శుక్రవారం	పల్మనాలజిస్ట్
శనివారం	జనరల్ సర్జన్

10 పడకలు.. ఏడుగురు సిబ్బంది

• అన్ని యూపీహెచ్‌సీలలో ఒకే తరహాలో వైద్య సేవలు అందుతున్నాయి. అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

• ప్రతి యూపీహెచ్‌సీలో ఏడుగురు వైద్య సిబ్బంది ఉన్నారు. వారిలో ఓ వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ అసిస్టెంట్, ఒక ఫార్మాసిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక అటెండర్ ఉన్నారు. ల్యాబ్‌లు, 10 పడకలు, సమావేశ గది, మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. వీరితో పాటు రోజుకొక స్పెషలిస్ట్ వైద్యుడు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వచ్చి సేవలందిస్తున్నారు.

• ప్రతి ఆస్పత్రిలో మందులు ఇచ్చే గది. ఓ ఫార్మాసిస్టు అందుబాటులో ఉన్నారు. జ్వరాలు, బీపీ, దగ్గు, జలుబుతో పాటు ఆర్థోపెడిక్, గైనిక్ తదితర వాటికి సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయి.

• యూపీహెచ్‌సీలలో కుక్క కాటు, పాము కాటుకు వ్యాక్సిన్‌లు ఉన్నాయి. సిద్ధం చేశారు.

39,005 మందికి వైద్య సేవలు

యూపీహెచ్‌సీలలో గతేడాది అక్టోబరు 2 నుంచి సేవలు అందుతున్నాయి. ప్రతి యూపీహెచ్‌సీలో రోజుకు 30 నుంచి 40 వరకు ఓపీ నమోదవుతుంది. వారిలో అవసరమైన వారికి 15 నుంచి 20 మందికి వివిధ రకాల పరీక్షలు చేస్తున్నారు. ఒక్కో ఆస్పత్రిలో నెలకు సుమారు 900 మందికి పైగా వైద్య సేవలు పొందుతున్నారు. ఆరిలోవ ప్రాంతంలో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు నాలుగు యూపీహెచ్‌సీలలో 39,005 మంది రోగులు సేవలు పొందారు. అలాగే ఇటీవల ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరాలలో మరో 7,062 మందికి వైద్య సేవలు అందించారు.

చేస్తున్న పరీక్షలు

• బీపీ, మధుమేహం, డెంగ్యూ, క్షయ, హిమోగ్లోబిన్, మలేరియా, పిట్స్, ఆయాసం తదితర వాటికి సంబంధించిన పరీక్షలు రోజూ చేస్తున్నారు. రోజూ ప్రతి ఆస్పత్రిలో 15 నుంచి 20 మంది వరకు ఆయా పరీక్షలు చేయించుకుంటున్నారు.



జీవీఎంసీ పదో వార్డులో వివేకానందనగర్ యూపీహెచ్‌సీ

రోగిని పరిశీలిస్తున్న చర్మవ్యాధి వైద్యులు(ఫైల్)

వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రాంతం	: 10వ వార్డు ఆదర్శనగర్ ప్రాంతం వివేకానందనగర్
నిర్మాణ వ్యయం	: కోటి రూపాయలు
బెడ్స్	: 10
ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తం ఓపీ	: 12,200 మంది
ఓపీ సమయం	: ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు



ఆరిలోవ కాలనీ యూపీహెచ్‌సీ (ఇన్‌సెట్) రోగికి రక్త పరీక్ష చేస్తున్న ల్యాబ్ అసిస్టెంట్(ఫైల్)

యూపీహెచ్‌సీ

ప్రాంతం	: 13వ వార్డు ఆరిలోవ కాలనీ(తోటగరువు)
నిర్మాణ వ్యయం	: కోటి రూపాయలు
ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తం ఓపీ	: 11,528 మంది
ఓపీ సమయం	: ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు



శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీ (ఇన్‌సెట్) ఓపీ నమోదు చేస్తున్న నర్సింగ్ సిబ్బంది(ఫైల్)

యూపీహెచ్‌సీ

ప్రాంతం	: 13వ వార్డు శ్రీకృష్ణాపురం
నిర్మాణ వ్యయం	: రూ.85 లక్షలు
ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తం ఓపీ	: 9,080 మంది
ఓపీ సమయం	: ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు



11వ వార్డు బాలాజీనగర్ యూపీహెచ్‌సీ (ఇన్‌సెట్) పడకలు

యూపీహెచ్‌సీ

ప్రాంతం	: 11వ వార్డు బాలాజీనగర్
నిర్మాణ వ్యయం	: రూ.1.10 కోట్లు
ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తం ఓపీ	: 13,259 మంది
ఓపీ సమయం	: ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు

ఇంటికి దగ్గరలోనే ఆస్పత్రి ఉంది..



మాది దుర్గాబజార్. కొన్నాళ్లుగా మధుమేహం, బీపీతో బాధపడుతున్నా. గతేడాది మా ఇంటికి దగ్గరలో యూపీహెచ్‌సీ ఏర్పాటు చేయడంతో చాలా వ్యయ, ప్రయాసలు తగ్గాయి. అవసరమైనప్పుడు డాక్టర్‌కు చూపించుకుంటున్నాను. షుగర్, బీపీ టెస్ట్ చేయించుకుని మందులు వాడుతున్నాను. ఇక్కడ వైద్యులు బాగా చూస్తున్నారు. ఇంటికి దగ్గరలో ఉండడంతో నడుచుకుంటూ ఆస్పత్రికి వెళ్తున్నాను.

– సూరాబత్తుల కొండమ్మ, దుర్గాబజార్, ఆరిలోవ యూపీహెచ్‌సీ

క్రమ శిక్షణతోనే ఉన్నత స్థాయి



ప్రభుత్వ బాలుర గృహంలో మాట్లాడుతున్న లోక్ అదాలత్ శాశ్వత చైర్మన్ వల్లభనాయుడు

ఆరిలోవ: ప్రభుత్వ బాలల గృహాల్లో నిర్వహించిన బాలల వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆరిలోవ ప్రాంతం దీన్‌దయాల్‌పురంలో ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో జరిగిన ముగింపు వేడుకలో లోక్ అదాలత్ శాశ్వత చైర్మన్ వల్లభనాయుడు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవడాలన్నారు. అటువంటి వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశ నాయకుల చరిత్రతో కూడిన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీఐసీఐ విశ్రాంత చీఫ్ మేనేజర్ మణిమాల, గృహం పర్యవేక్షణాధికారి వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దీనదయాల్‌పురంలో ప్రభుత్వ బాలుర గృహంలో నిర్వహించిన ముగింపు వారోత్సవాలలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ప్రత్యేక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, గృహం పర్యవేక్షణాధికారి వీరయ్య, సీడబ్ల్యూసీ సభ్యులు, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

త్వరగా అభివృద్ధి పనులు పూర్తికి ఆదేశం



12వ సూర్యతేజానగ్ వద్ద బ్రిడ్జి పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్

ఆరిలోవ: నగరంలో రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కూడళ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. జీవీఎంసీ అధికారులతో కలసి ఆయన సోమవారం విశాలాక్షినగర్, ఆరిలోవ ప్రాంతాల్లో పర్యటించారు. 9వ వార్డు విశాలాక్షినగర్‌లో కైలాసగిరి కూడలి ఆధునికీకరణ, రోడవ్ విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం 12వ వార్డు సూర్యతేజానగర్ వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులు, 13వ వార్డు ముడసర్లోవ వద్ద డంపింగ్‌యార్డులో జరుగుతున్న క్లోజ్డ్ కంపేక్టర్ సిస్టం నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైలాసగిరి కూడలి పనులు, అక్కడి నుంచి హనుమంతవాక కూడలి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణలో భాగంగా లైటింగ్, ఫుట్‌పాత్‌లు, కాలువల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. పెదగదిలి కూడలి వద్ద గ్రీన్ బెల్ట్‌లో ఉన్న బడ్డీలు, తోపుడు బండ్లు తొలగించి శుభ్రం చేయాలన్నారు. క్లోజ్డ్ కంపేక్టర్ సిస్టం ద్వారా వ్యర్థాలు నిల్వ ఉండకుండా ఏరోజుకారోజు తరలించే ప్రక్రియ చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దామోదరరావు, జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాకర్ కిశోర్ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



కృష్ణా కళాశాలలో మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యుడు బాల మోహన్‌దాస్



రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అరుదైన పుస్తక ప్రదర్శన, సదస్సుల ముగింపు కార్యక్రమం సాయంత్రం నిర్వహించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ముఖ్యఅతిథిగా హాజరై సదస్సులో పాల్గొన్న పరిశోధకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. గ్రంథాలయాన్ని విద్యార్థులకు ఉపయుక్తంగా తీర్చిదిద్దిన గ్రంథాలయ అధికారి పి.వెంకటేశ్వర్లు, సిబ్బందిని అభినందించారు.

ఎస్ఆర్ రంగనాథ్‌కు నివాళి

ఎంవీపీ కాలనీ: గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథ్‌కు ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. ఎంవీపీ కాలనీ శాఖ గ్రంథాలయాన్ని పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. విశ్రాంత ఆచార్యుడు బాల మోహన్‌దాస్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు, గ్రంథాలయ అధికారి ఎం.శ్రీనివాస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



సభలో పాల్గొన్న మహిళలు



11వ వార్డు గాంధీనగర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుంది కనుకే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మేయర్‌తో కలిసి ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో విశాఖను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గంలో రూ.కోట్లు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రోడ్లు నిర్మాణాలు, గెడ్డలు ఆధునీకరణ, బ్రిడ్జిలు, యూపీహెచ్‌సీల నిర్మాణం, పాఠశాలల్లో నాడు–నేడు పనులు పూర్తి చేశామన్నారు. అభివృద్ధి పనులు కొనసాగడానికి వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, వార్డు స్పెషల్ ఆఫీసర్ వెంకటరావు, సచివాలయాల కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతారావుకు అంబేడ్కర్ సేవారత్న అవార్డు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ స్టడీస్‌లో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేస్తున్న డాక్టర్ గూడపాటి శాంతారావును ఏపీ బహుజన జాయింట్ యాక్షన్ కమిటీ అంబేడ్కర్ సేవరత్న పురస్కారంతో సత్కరించింది. సంస్థ మూడో వార్షికోత్సవంలో భాగంగా ఇటీవల భీమవరం దగ్గర పేరుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా శాంతారావును ఏయూ ఆచార్యులు అభినందించారు.

ఆలోచింపజేసిన 'కొడుకు పుట్టాలా' నాటిక



కొడుకు పుట్టాల నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : విశాఖ.. కళలకు పుట్టినిల్లులాంటిదని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి అన్నారు. గణేష్ పాత్రో రచించిన కొడుకు పుట్టాలా? నాటికను ఆంధ్రా విశ్వవిద్యాలయం, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నటరాజ కుప్పిల వెంకటేశ్వరరావు శత జయంతి సందర్భంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూలో కళా ప్రదర్శనల కోసం ఓపెన్ ఆడిటోరియాన్ని సిద్ధం చేశామన్నారు. కె.విజయలక్ష్మి దర్శకత్వంలో నాటికను ప్రదర్శించారు. రైటర్స్ అకాడమి చైర్మన్ వి.వి.రమణమూర్తి, స్టార్ మేకర్ లంక సత్యానంద్, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామ స్మరణ

- ఘనంగా తొలి సోమవారం పూజలు
- భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిట



విశాలాక్షినగర్‌లో కైలాసనాథుని ఆలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ దంపతులు



పెదగదిలి శివాలయంలో పూజలు చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటమారి

ఆరిలోవ: కార్తిక మాసం తొలి సోమవారం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగిపోయాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు శివాలయాలకు చేరుకుని శివుడిని దర్శించుకున్నారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. క్యూలో ఉన్న భక్తులకు తాగునీరు, ప్రసాదం అందజేశారు. ఆరిలోవ ప్రాంతం శివాజీనగర్–2, ఆపరేషన్ కాలనీ, నెహ్రూనగర్, పెదగదిలి, రవీంద్రనగర్, ఆదర్శనగర్, హనుమంతవాక, విశాలాక్షినగర్‌లోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. ధ్వజ స్తంభాల వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ దంపతులు 9వ వార్డు విశాలాక్షినగర్‌లో కైలాసనాథుడిని దర్శించుకున్నారు. ఇక్కడ అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఎస్పీ దంపతులకు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆరిలోవ: పెదగదిలి శివాలయంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అసంగానంద ఆశ్రమంలో అభిషేకం చేస్తున్న భక్తులు



గొల్లల వీధి శివాలయంలో..

మద్దిలపాలెం : పీతలవానిపాలెం, గొల్లల వీధి, ఇసుకతోట, హెచ్‌బీకాలనీలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప పడి చేసి కైంకర్యాన్ని వితరణ చేశారు.

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు, చినవాల్తేరులోని శివాలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. అసంగానంద ఆశ్రమంలో భక్తులు స్వయంగా శివాభిషేకం చేశారు. సాయంత్రం మహిళలు భక్తి గీతాలను ఆలపించారు.